సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం | 11 | నవంబర్ | 2023



ఉత్సాహంగా చెస్ పోటీలు
కడపలోని చదరంగం హాల్‌లో శుక్రవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ ప్రాంతీయ చదరంగం ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించారు. -IIలో



పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ
గోపవరం మండలంలో సోమశిల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టెట్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. -IIలో

గరిష్టం/కనిష్టం
32.9/23.1

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 23.1 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు ఆర్చరీ ఎంపికలు
కడప స్పోర్ట్స్: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఆర్చరీ క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో జరిగే ఎంపికలకు క్రీడాకారులు సంబంధిత ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ముగిసిన బీఈడీ పరీక్షలు
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 6న ప్రారంభమైన బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. విశ్వవిద్యాలయం హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య డి. విజయరాఘవప్రసాద్ కడపలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు.

నేడు 'ఆజాద్' జయంతి
కడప రూరల్: భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం కడప కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, అనధికారులు, ముస్లిం పెద్దలు, విద్యావేత్తలు హాజరు కావాలని కోరారు.

20 లోగా ఫీజులు చెల్లించాలి
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 2024 సంవత్సరంలో జరిగే పదో తగరతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా రూ. 125 పరీక్ష ఫీజును చెల్లించవచ్చని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. 21 నుంచి 25వ తేదీ వరకు రూ.50 ఆలస్య రుసుంతో, 26 నుంచి 30 వరకు రూ.200, డిసెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రూ. 500 ఆలస్య రుసుంతో పరీక్ష ఫీజును చెల్లించవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



స్టాఫ్‌నర్సుల నియామక కౌన్సెలింగ్ చేపడుతున్న ఆర్డీ రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో 94 పోస్టులకు నిర్వహించిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామక కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అలావుల్లా, బత్తనయ్య, వినీష తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలు జరపాలి
కడప అగ్రికల్చర్: అఖిల భారత సహకార వారోత్సవాలు పురస్కరించుకుని జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా సహకార అధికారి సుభాషిణి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 14న సహకార సంఘాల్లో ఇటీవల పరిణామాలు, 15న సహకార సంఘాల పునరుజ్జీవనం, ఆర్థిక చేరిక, 16న సహకార సంఘాల డిజిటలైజేషన్ కోసం సాంకేతికతను స్వీకరించడం, అప్‌గ్రేడ్ చేయడం, 17న సహకార సంస్థల కోసం వ్యాపారాన్ని సులభతరం, 18న పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో సహకార భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకారం సంఘాలు, 20న సహకార విద్య, శిక్షణ అనే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

సమయాన్ని వినియోగించుకోవాలి



విద్యార్థుల పుస్తకాలను తనిఖీ చేస్తున్న పార్వతి

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పార్వతి సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా పలు ఎయిడెడ్ పాఠశాలలు, కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాలల మెయిన్‌ను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులకు సంబంధించి సిలబస్ ఏ మేరకు పూర్తయింది, ఏ విధంగా చదువుతున్నారనే విషయాలపై ఆరాతీశారు.అసిస్టెంట్ డైరెక్టర్ భానుప్రసాద్, సూపరింటెండెంట్లు రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు

- సొంతమనుషుల్లా ఒకచోట చేరిన నేతలు
- సామాన్యులతో మమేకమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నూతనంగా నిర్మించిన రెండు పోలీసుస్టేషన్లు ప్రారంభం



ఇడుపులపాయ నెమలిపార్కులో వేముల మండల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వారంతా సొంత మనుషులు. కష్టసుఖాల్లో వెన్నంటి నడిచిన సైనికులు. విపత్కర పరిస్థితుల్లో మనోధైర్యం నింపి, మీ వెంట మేమున్నామని చాటి చెప్పి, రాష్ట్రం వైపు నడిపించిన నేతలు. అలాంటి వారంతా ఒక్కచోటికి చేరడంతో ఆత్మీయత ఉట్టి పడింది. శుక్రవారం ఇడుపులపాయలో ఇదంతా ఆవిష్కరితమైంది.సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేముల మండలానికి చెందిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలను పేరుపేరునా పలికరించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇంటి పెద్ద కష్ట సుఖాలు స్వయంగా అడిగి తెలుసుకుంటుంటే అక్కడి వారి మోముల్లో ఆనందం పరవళ్లు తొక్కింది.

బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు చేస్తాండారు, మెట్ట భూములు సాగునీళ్లతో తడుస్తున్నాయి. పిల్ల కాలువలకు లైనింగ్ పనులు చేయించండి సార్... 60శాతం మెట్ట భూములు మాగాణిగా మారుతాయి. బెరైటీస్, సున్నపురాయి, సుద్ద బాగా దొరుకుతోంది, వాటి ఆధారిత పరిశ్రమలొస్తే ఇక్కడే యువతకు ఉద్యోగ ఉపాధి లభిస్తోందంటూ వేముల మండల వాసులు వివరిస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధగా ఆలకించారు. స్థానికులకు పరిష్కార మార్గాలను సూచిస్తూనే, రైతాంగం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి, తర, తమ, వర్గ బేధాలు లేకుండా ప్రజలకు అందిస్తున్న సంక్షేమం వివరాలను సీఎం వివరించారు. మీరంతా అండగా నిలవడంతోనే ఇది సాధ్యమైందని, పులివెందుల నియోజకవర్గ కుటుంబ సభ్యులైన వేముల మండల వాసులకు ధన్యవాదాలు తెలిపారు.

సన్నిహితులు..ఆత్మీయులతో మమేకం...

రెండు రోజుల పర్యటనలో ఓవైపు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, సమీక్షలు నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాన్యులతో మమేకమయ్యారు అంతరంగికులు సన్నిహితులతో సరదాగా గడిపారు.ఆత్మీయులను ఆలింగనం చేసుకున్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం...

ఇటీవల మృతి చెందిన పెండ్లిమర్రి మండల వైఎస్సార్‌సీపీ నేత సీవై రామ్మోహన్‌రెడ్డి కుటుంబసభ్యుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. మోహన్ మా కుటుంబ సభ్యుడు.. మీకు అండగా మేముంటాం. అధైర్యపడొద్దని ఆయన సతీమణి మాజీ ఎంపీపీ అనూరాధ, కుమారుడు శ్రీహర్ష, కుమార్తె శ్రీలక్ష్మిలకు ధైర్యం చెప్పారు. ఇడుపులపాయలోని సీఎం గెస్ట్‌హౌస్‌కు దివంగత రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుల్ని పలిపించుకుని వారిని ఓదార్చారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డిలు రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న తీరుతెన్నులు, కుటుంబ పరిస్థితులను వివరించారు. నాన్న లేడనే బెంగ పెట్టుకోకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని కుమార్తె శ్రీలక్ష్మికి ధైర్యం చెప్పారు.

పోలీసుస్టేషన్లు ప్రారంభం
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జిల్లాలోని ఆర్కేవ్యాలీ, జమ్మలమడుగులో పోలీసు స్టేషన్లు ప్రారంభించారు. రూ.1.75 కోట్లతో ఇడుపులపాయలో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. రూ.2.75 కోట్లతో జమ్మలమడుగులో నిర్మించిన పోలీసుస్టేషన్‌ను వర్చువల్ ద్వారా సీఎం ప్రారంభించారు. అనంతరం ఇడుపులపాయ పోలీసుస్టేషన్‌లో విజిటర్స్ బుక్‌లో 'ఆల్ ది బెస్ట్' చెబుతూ సీఎం సంతకం చేశారు. స్టేషన్ ఆవరణలో పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ గోవిందరెడ్డి,పోలీసు సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.



ఇడుపులపాయ సర్పంచ్ నాగమ్మతో కలిసి పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

సీఎం పర్యటన విజయవంతం
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటన జిల్లాలో విజయవంతంగా ముగిసింది. తొలిరోజు రూ.64.54 కోట్లకు చెందిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టారు. రెండో రోజు రూ.4.5కోట్లతో నిర్మించిన రెండు పోలీసు స్టేషన్లు ప్రారంభించారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చోటుచేసుకున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు సీఎం పర్యటనలో పాల్గొని విజయవంతం చేశారు.

గ్రంథాలయ ఉత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఎం, తదితరులు

కడప కల్చరల్: 56వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి, వేల్పుల రామలింగారెడ్డి రూపొందించిన పోస్టర్లను సీఎం ఆవిష్కరించి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

డిసెంబర్‌లో ఏఎఫ్‌యూకు భూమిపూజ



సీఎంతో మాట్లాడుతున్న ఏఎఫ్‌యూ వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ: డిసెంబర్ నెలలో వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్లు డా.వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలో సీఎంను వారు కలిసి ఈ విషయమై మాట్లాడారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. డిసెంబర్‌లో భూమిపూజ కార్యక్రమం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు.

సామాజిక ప్రభంజనం

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. ఊరు వాడా కదిలొచ్చిందా.. జన ప్రవాహం పరవళ్లు తొక్కిందా అనిపించింది. నాయకులకు జనం బ్రహ్మరథం పట్టారు. జననేత జగన్ జనంలోకి వచ్చినంత వేడుకగా ఆయన పంపిన సైన్యానికి అడుగడుగునా స్వాగతం పలికారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతిన బూనారు. ప్రభుత్వం చేసిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే సంక్షేమం కింద తమకు అందించిన సాయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు.

- పెద్దతిప్పసముద్రం నుంచి ములకలచెరువు వరకు
- దద్దరిల్లిన తంబళ్లపల్లి సామాజిక సాధికార సభ
- అడుగడుగునా నాయకులకు ప్రజల బ్రహ్మరథం
- పీటీఎం నుంచి మద్దయ్యగారిపల్లె వరకు పాదయాత్ర



అన్నమయ్య జిల్లా ములకలచెరువులో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన జనం



బస్సు యాత్రలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలంలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో చైతన్యం వెల్లివిరిసింది. తమను గుర్తించి ఆర్థిక, సామాజికంగా ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వానికి కృతఘ్నుతగా వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో ములకలచెరువు మురిసిపోయింది. మంత్రులు మేరుగ నాగార్జున, ఉషశ్రీ చరణ్, గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ కుంభారవి యాత్రకు హాజరయ్యారు. వారు పెద్ద తిప్పసముద్రం సమీపంలోని కింగ్ కళ్యాణ్‌మండపానికి చేరుకోగా భారీ సంఖ్యలో శ్రేణులు తరలివచ్చారు. అక్కడి నుంచి మధ్యాహ్నం బస్సుపై నుంచి అభివాదం చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్దతిప్పసముద్రం చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి విగ్రహానికి మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

దారి పొడవునా బారులు

పెద్దతిప్పసముద్రం నుంచి మద్దయ్యగారిపల్లె వరకు బస్సు యాత్ర సాగింది. పెద్ద సంఖ్యలో వచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు బస్సు ముందు నడుచుకుంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. బస్సు యాత్ర మద్దయ్యగారిపల్లెకు చేరుకోగానే రోడ్డుకు ఇరువైపులా మహిళలు, ప్రజలు బారులు తీరి స్వాగతం పలుకుతూ పూలవర్షం కురిపించారు. యువత అభిమానంతో కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. అనంతరం అక్కడి దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొంతలపల్లెవద్ద మహిళలు పూలవర్షం కురిపించగా, పులికల్లు వద్ద మహిళలు, స్థానికులు భారీ సంఖ్యలో చేరుకుని బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న నేతలపై పూలవర్షం కురిపించారు. అక్కడి నుంచి ములకలచెరువుకు చేరుకోగా కిలోమీటరు దూరానికి అరగంటకుపైగా పట్టింది. తమ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి అండగా నిలవాలని తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో ములకలచెరువులో సాధికార సభ నిర్వహించిన మూడురోడ్ల కూడలి కిక్కిరిసిపోయింది.

ప్రసంగాలకు స్పందన

సాధికార సభకు హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేసిన ప్రసంగాలకు స్పందన లభించింది. గతంలో లభించిన ప్రాధాన్యత, ప్రస్తుతం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత, గౌరవం గురించి ప్రసంగిస్తుంటే సభికుల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా చంద్రబాబు ఈ వర్గాలను ఏ విధంగా ఓట్ల కోసం వాడుకున్నారు, గెలిచాక ఎలా వదిలేశారు అన్నది విపులంగా వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సామాజిక విప్లవం తీసుకొచ్చి సాధించిన సాధికారత గురించి చెప్పడంతో ప్రజలు నినాదాలతో హోరెత్తించారు.

మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు స్పందన



సింహాద్రిపురం: గురజాల నేతాజీ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వైవీయూ: సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. కడపలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురజాల గ్రామంలోని నేతాజీ హైస్కూల్‌లలో ఈ కాంపిటీషన్ నిర్వహించారు. శనివారం నిర్వహించి తొలిరౌండ్ కాంపిటీషన్‌లో కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. వారిలో గణితం పట్ల ఆసక్తి పెంచేలా.. చిన్నచిన్న సమస్యలు మొదలు.. స్థాయిని అనుసరించి నిర్వహించిన కాంపిటీషన్ ఎంతో బాగుందని పేర్కొన్నారు.

అక్రమంగా టపాసులు నిల్వ ఉంచితే చర్యలు

జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా.. అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారిపై పేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని విక్రయదారులకు జిల్లా ఎస్పీ సూచనలు చేశారు. సూచించిన బహిరంగ ప్రదేశాలలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. నీరు, ఇసుక, తదితర సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్నపిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. లైసెన్సులు కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. దీపావళి పండుగను జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాణాసంచాను అనుమతి లేకుండా తయారు చేసినా.. వాటిని వినియోగించినా అటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం చేరవేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

26న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఈ నెల 26వ తేదీదీన ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. భక్తులు తమ టిక్కెట్లను ముందుగా రిజర్వు చేసుకోవాలని కోరారు.

- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సు వెళుతుందన్నారు. టిక్కెట్ ధర రాను, పోను రూ. 1557గా ఉంటుందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6 గంటలకు, మైదుకూరులో ఉదయం 7కు, సాయంత్రం 6కు మూడు సర్వీసులు బయలుదేరుతాయన్నారు. టిక్కెట్ ధర రూ.1135, రూ.1414గా ఉందన్నారు.
- బద్వేలు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 5.30, 6 గంటలకు సర్వీసులు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళతాయన్నారు. టిక్కెట్ ధర రూ.1566, రూ.1475గా ఉంటుందన్నారు.
- కడప డిపో నుంచి ఉదయం 5కు బస్సు బయలుదేరుతుందని, టిక్కెట్ ధర రూ. 1072గా ఉంటుందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7కు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా సర్వీసు వెళుతుందన్నారు. టిక్కెట్‌ధర రూ.1242గా నిర్ణయించారన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6కు బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా బస్సులు వెళతాయన్నారు. టిక్కెట్ ధర రూ.1273గా ఉంటుందన్నారు.

పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్

గోపవరం : మండలంలోని రాచాయపేట, ఎస్.రామాపురం గ్రామాల సమీపంలో 900 మెగావాట్ల సోమశిల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (నెడ్‌క్యాప్) వారు ప్రతిపాదించడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం బుచ్చనపల్లె గ్రామ సమీపంలో ప్యానల్ కమిటీ చైర్మన్, తెలుగుగంగ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాచాయపేట, ఎస్.రామాపురం గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రజలు, పర్యావరణ ఎన్‌జీఓలు పాల్గొని ప్రాజెక్టు ఏర్పాటుపై అభిప్రాయాన్ని తెలియజేశారు. 900 మెగావాట్లతో ఏర్పాటు చేసే పవర్ ప్రాజెక్టుకు సోమశిల వెనుకజలాల నుంచి నీటిని వన్‌టైం పంపింగ్ ద్వారా ఉపయోగిస్తారు. సోమశిల ప్రాజెక్టు నెలకొల్పడానికి నూతన ఎగువ, దిగువ రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉందని నెడ్‌క్యాప్ నిర్వాహకులు తెలిపారు. ఎగువ రిజర్వాయర్ నిర్మాణం కోసం 36.34 హెక్టార్లు, దిగువ రిజర్వాయర్ నిర్మాణం కోసం 79.34 హెకార్ల అటవీ భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. 900 మెగావాట్ల హైడ్రోపవర్ ఉత్పత్తి చేసేందుకు ఎగువ రిజర్వాయర్‌లో ఉన్న నీటిని దిగువ రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా పంపి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోమశిల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ (ఎస్‌ఎంఎఫ్‌టీ) కోసం మొత్తం 212.466 హెక్టార్ల అటవీభూమి అవసరమని ప్రతిపాదనలు పంపించడం జరిగిందని నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి తెలిపారు. రూ.3500 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పర్యావరణ నిర్వహణ ప్రణాళికను అమలు చేయడానికి కూడా రూ.6332 కోట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత వాసులకు ఎలాంటి కాలుష్య ప్రభావం ఉండదని, మొత్తం అటవీ ప్రాంతానికే పరిమితమవుతుందని తెలిపారు. ప్రాజెక్టు ఏర్పాటు చేసే రెండు గ్రామ పంచాయతీల పరిధిలో నిరుద్యోగులకు ఉద్యోగ, కూలీలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ దశలో గానీ, పూర్తయిన తర్వాత స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధి, మహిళలకు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలతోపాటు పర్యావరణ ఎన్‌జీవోలు డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ పొల్యూషన్ అధికారి అశోక్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్టీపీపీకి ఎంవీఆర్ పేరు’పై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేల రాజారాంరెడ్డి, ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు క్రైం : ఆర్టీపీపీకి డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌గా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడంపై ఎంవీఆర్ కుమారుడు మల్లేల రాజారాంరెడ్డి, రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ మల్లేల ఝాన్సీరాణి హర్షం వ్యక్తం చేశారు. వారు లింగాపురంలోని వారి స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి రాయలసీమ సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఇందులో భాగంగానే 1985లో 21 రోజులు నిరాహార దీక్ష చేసిన ఫలితంగా నాటి ప్రభుత్వం రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల వేలాది మందికి ఉద్యోగాలు, పరోక్షంగా ఉపాధి లభించిందన్నారు. ఎంవీఆర్ పేరును ఆర్టీపీపీకి పెట్టడంపై ఎంవీఆర్ అభిమానులు, నాడు రాయలసీమ విమోచన సమితిలో పాల్గొని నిరాహార దీక్ష చేసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎంవీ రమణారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని వారు చెప్పారు.

అటవీ ఉద్యోగుల త్యాగాలు మరువలేనివి

కడప అర్బన్ : అటవీ ఉద్యోగులు చేసిన త్యాగాలు మరువలేనివని నాలుగవ జిల్లా అదనపు న్యాయమూర్తి దీనబాబు అన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడపలోని డీఎఫ్‌ఓ కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను వుంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎఫ్‌ఓ పి.వి సందీప్‌రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్, స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాగార్జునరెడ్డి, రేంజ్ అధికారులు, ఎఫ్‌బీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రౌన్‌పై మరింత అధ్యయనం అవసరం


బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

కడప కల్చరల్ : తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్‌పై మరింత అధ్యయనం అవసరమని, ఆ దిశగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం కృషి చేస్తోందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ ఆధ్వర్యాన బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ 225వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకుడు తప్పెట రామప్రసాదరెడ్డి, శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ రాణి సదాశివమూర్తి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు దేవారెడ్డి విజయలక్ష్మి, రచయిత, రాయలసీమ ఉద్యమకారుడు భూమన్, బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యానికి బ్రౌన్ చేసిన సేవలను వివరించారు. సీపీ బ్రౌన్ నాటక, వేమన పద్యాల ఆలాపన, కత్తి, కర్రసాము, తోలుబొమ్మలాట తదితరాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యాపకులు ఎస్.ఈశ్వరరెడ్డి, రమాదేవి, పార్వతి, ఎం.ఎం.వినోదిని, పుత్తా పద్మ, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, నందారపు చెన్నకృష్ణారెడ్డి తోపాటు పలువురు కవులు, రచయితలు, విద్యావేత్తలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

- రాజీవ్ నగర్‌లో ఉన్న బ్రౌన్ విగ్రహానికి ఏపీజీబీ రీజనల్ మేనేజర్ జి.పురుషోత్తమ్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వసంత, పలువురు బ్యాంక్ అధికారులు పూలమాల వేసి, నివాళులర్పించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


చదరంగం ఎంపికల్లో పాల్గొన్న పోస్టల్ శాఖ ఉద్యోగులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో శుక్రవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ ప్రాంతీయ చదరంగం ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎంపికలను పోస్టల్ శాఖ కడప డివిజన్ సూపరింటెండెంట్ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు విజయవాడ, ఒంగోలు, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు, తిరుపతి, కడప డివిజన్ల నుంచి క్రీడాకారులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. రీజినల్ స్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ పోస్టల్ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనీస్‌దర్బారీ, నేషనల్ ఆర్బిటర్లు హరిరామ్‌ప్రసాద్, వంశీకృష్ణ, పోస్టల్‌శాఖ ఏఎస్పీలు విజయభాస్కర్, భాస్కర్ రెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, సంతోష్‌రెడ్డి, సింహ పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ ఆవరణలోని డ్రైనేజీ కాలువలో జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎర్రగుంట్ల జీఆర్‌పీ ఎస్‌ఐ కె.రారాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేటలో గంజి సుధాకర్(49) నివాసం ఉంటున్నాడు. క్లాత్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండే వాడు. ఆయన కుమారుడు జడ్చర్లలో చదువుతున్నాడు. దీపావళికి ఇంటికి పిలుచుకుని రావడానికి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో నుంచి రైలుకు వెళ్లడానికి గురువారం రాత్రి వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో బస్టాండ్ పక్కనే ఉన్న రక్షణగోడను ఎక్కి దాటుతూ ప్రమాదవశాత్తు జారి గోడ పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలో పడ్డాడు. తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డీసీబీఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

రాయచోటి టౌన్: డీసీబీఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే రవి (36) అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయచోటి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన రవి 2009లో ఉద్యోగంలో చేరాడు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత జిల్లా పోలీస్ కార్యాలయంలో డీసీబీఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా లివర్ పాడైన రవి గత కొన్ని నెలలుగా తిరుపతి, కడప ఆస్పత్రులలో చికిత్స పొందాడు. అయినా పెద్దగా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం అందరికంటే ముందే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. సహచరులు వచ్చి గమనించే సరికి ఆయన ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్–19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6–3తో గెలిచి, రెండో సెట్‌లో 3–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రవాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.



రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు

దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021–జూన్), ఎజాజ్ పటేల్ (2021–డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా



డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆ్రస్టేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.



ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–45, 4–94, 5–112, 6–116, 7–160, 8–204, 9–226, 10–244. **బౌలింగ్:** రబడ 10–0–40–0, ఎన్‌గిడి 8.3–0–69–2, మార్క్‌రమ్ 4.3–0–25–0, కొయెట్జీ 10–1–44–4, కేశవ్ మహరాజ్ 10–1–25–2, ఫెలుక్‌వాయో 7–0–36–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1–64, 2–66, 3–116, 4–139, 5–182. **బౌలింగ్:** ముజీబ్ 10–0–51–1, నవీనుల్ 6.3–0–52–0, నబీ 10–1–35–2, ఒమర్జాయ్ 1–0–8–0, రషీద్ ఖాన్ 10–1–37–2, నూర్ అహ్మద్ 9–0–49–0, రహ్మత్ షా 1–0–12–0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ X పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి–ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్–ప్రబీర్ జోడీ 2–6, 3–6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా–అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.

సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్టె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11–1, 7–11, 19–17, 8–11, 11–6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.



● ధనుష్, ఇళయరాజా

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''**మా** పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''**అ**లా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.